

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 20-11-2025 | సంపుటి - 25 | సంచిక -185 | రూ : 4 | పేజీలు: 8

## వోకల్ ఫర్ లోకల్ మంత్రం

### పుట్టపర్తి వేదికగా ప్రధాని మోదీ కీలక పిలుపు

- పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ
- రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేసిన ప్రధాని
- సాయి బోధించిన ప్రేమ, సేవా మార్గం ప్రపంచానికి ఆదర్శమని వ్యాఖ్య



2లో



2లో

## మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ..

### హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి శుభవార్త

- హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం, రాష్ట్రం 50:50 వాటా
- నగరంలో అదనంగా 160 కి.మీ. మెట్రో లైన్ల నిర్మాణంపై ప్రతిపాదనలు
- విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులను పరిశీలిస్తున్నామన్న కేంద్రం
- మూసీ నది అభివృద్ధికి అమృత్ పథకం కింద నిధులు



2లో

## ప్రేమ, సేవకు ప్రతిరూపం సత్యసాయి..

- పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు
- హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఈ భూమిపై మనం చూసిన దైవ స్వరూపం బాబా అని కొనియాడిన సీఎం
- రూ.100 స్మారక నాణెం, తపాలా బిళ్లను విడుదల చేసిన ప్రధాని, ముఖ్యమంత్రి




2లో

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం

- ఓటరు జాబితా సవరణకు షెడ్యూలును ప్రకటించిన ఎన్నికల సంఘం
- ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ
- జిల్లా పంచాయతీ అధికారులకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు

## మరింత పక్కాగా ప్రాక్టికల్స్

- అటు సీసీ కెమెరాలు.. ఇటు ఫ్లయింగ్ స్క్వాడ్లు
- 'కమాండ్ కంట్రోల్' పరిధిలోని కళాశాలల్లోనే పరీక్షా కేంద్రాలు...

2లో




## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అరెస్టు

2లో



- సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన
- సింగరేణి భవన్ ఎదుట ఆందోళనకు దిగిన కవిత
- కవితను అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

## రైతులు.. కాలర్ ఎగరేసుకునేలా చేస్తా

- అన్నదాత అభ్యున్నతికి పంచ సూత్రాలు
- నూతన విధానాలతో ముందుకు 'సాగు'దాం
- 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధుల విడుదలలో సీఎం చంద్రబాబు

2లో




## ఢిల్లీ పేలుడు... బయటకు వెళితే అనుమానంగా చూస్తున్నారు



2లో

- కొంతమంది చేసిన తప్పులకు కశ్మీరీలను బాధ్యులను చేయడం సరికాదన్న ఒమర్ అబ్దుల్లా
- ఉగ్ర కుట్రలకు తమను ఎక్కడ బాధ్యులను చేస్తారేమో అనే భయం ఉందని వ్యాఖ్య



# ప్రేమ, సేవకు ప్రతిరూపం సత్యసాయి..

పుట్టపర్తి, నవంబర్ 19 : ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ప్రేమ, సేవ, శాంతి, పరిష్కారానికి బాబా నిలువెత్తు నిదర్శనమని ఆయన కొనియాడారు. పుట్టపర్తిలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబా సేవలను స్మరించుకుంటూ ప్రధాని రూ.100 విలువైన స్మారక నాణేన్ని, ప్రధాని మోదీతో కలిసి సీఎం చంద్రబాబు స్మారక తపాలా బిళ్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భగవాన్ నడిచిన ఈ పుణ్యభూమిలో ఆయన శత జయంతి వేడుకలు జరుపుకోవడం అదృష్టమని అన్నారు. "లవ్ ఆల్, సర్వ్ ఆల్, హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్" అనేది సత్యసాయి చూపిన మార్గమని, విశ్వశాంతి, సకల జనుల సంతోషం అనే ఉన్నత భావనతో ఆయన జీవించారని గుర్తుచేశారు. "మానవ సేవే మాధవ సేవ" అని కేవలం బోధించడమే కాకుండా, దాన్ని ఆచరించి ఫలితాలు చూపించిన మహనీయుడు బాబా అని పేర్కొన్నారు. ప్రేమ ఒక్కటే మతమని, హృదయం ఒక్కటే భాష అని, మానవత్వమే కులమని చాటిచెప్పారని, ఆయన బోధనలతో నాస్తికులను సైతం ఆధ్యాత్మికత వైపు నడిపించారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రజలను తన మనో దర్శనంతో ప్రభావితం చేశారని అన్నారు. బాబాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, భక్తులను ఆయన ఎంతో ప్రేమగా 'బంగారూ' అని పిలిచే పిలుపు ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. సత్యసాయి ట్రస్ట్ కార్యక్రమాలపై బాబా పలుమార్లు తనతో చర్చించారని నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. విలువలతో కూడిన విద్యను 1వ తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా అందించిన ఘనత సత్యసాయిదని అన్నారు. నేడు 102 సత్యసాయి విద్యాలయాల ద్వారా సుమారు 60,000 మంది విద్యార్థులు ఉత్తమ విద్యను పొందుతున్నారని వివరించారు. అదేవిధంగా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, జనరల్ ఆసుపత్రులు, మొబైల్ క్లినిక్‌ల ద్వారా ప్రతిరోజూ వేలాది మంది రోగులకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడానికి ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టైనా ప్రాజెక్టును పూర్తి చేయాలని బాబా సంకల్పించారని చంద్రబాబు ఓ ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విషయం తెలిసిన భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కోట్లాది రూపాయల విరాళాలు ఇచ్చారని, దీంతో రూ.550 కోట్ల వ్యయంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోని 1600 గ్రామాలకు, 30 లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీరు అందిందని వివరించారు. చెన్నై తాగునీటి పథకం ఆధునికీకరణకు రూ.250 కోట్లు వెచ్చించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని, ఆయన స్ఫూర్తిని, చూపిన మార్గాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చంద్రబాబు పిలుపునిచ్చారు.

*** సత్యసాయి ఒక అరుదైన ఆధ్యాత్మిక శక్తి: పవన్ కల్యాణ్**

ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సత్యసాయి బాబాను 'ప్రపంచానికి వెలుగులిచ్చే అరుదైన ఆధ్యాత్మిక శక్తి'గా అభివర్ణించారు. అనంతపురం జిల్లాలో ఆయన జన్మించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందని తెలిపారు. విదేశాల్లో సైతం సత్యసాయికి లక్షలాది మంది భక్తులు ఉండటం గర్వకారణమన్నారు. ప్రభుత్వాలు ఆలోచించకముందే జల్‌జీవన్ మిషన్ తరహాలో సామాన్యులకు తాగునీరు అందించిన మహనీయుడని కొనియాడారు. సచిన్ తెందూల్కర్ వంటి ప్రముఖులతో పాటు ఎందరో ఐఏఎస్ అధికారులు సైతం ఆయన ప్రభావానికి లోనయ్యారని గుర్తుచేశారు. సత్యసాయి బాబా స్ఫూర్తిని తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## 'వోకల్ ఫర్ లోకల్' మంత్రం..
## పుట్టపర్తి వేదికగా ప్రధాని మోదీ కీలక పిలుపు

పుట్టపర్తి, నవంబర్ 19 : శ్రీ సత్యసాయి బాబా బోధించిన ప్రేమ, సేవా మార్గాలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో జరిగిన శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.100 స్మారక నాణేన్ని, ప్రత్యేక తపాలా బిళ్లను ఆవిష్కరించారు. హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో మోదీ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా జీవితం 'వసుధైవ కుటుంబం' అనే భారతీయ భావనకు నిలువుటద్దమని కొనియాడారు. "లవ్ ఆల్, సర్వ్ ఆల్" అనే ఆయన సందేశం అజరామరమని, బాబా భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన స్థాపించిన సంస్థలు మానవ సేవే మాధవ సేవ స్ఫూర్తితో సేవలను కొనసాగిస్తున్నాయని ప్రశంసించారు. భుజ్ భూకంపం వంటి విపత్తుల సమయంలో సత్యసాయి సేవాదళ్ అందించిన సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో 100 గిర్ జాతి ఆవులను పేద కుటుంబాలకు ప్రధాని తన చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' ద్వారా పేదల జీవితాల్లో మార్పు తెస్తున్నామని వివరించారు.

దేశం 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు సాగుతోందని, దీనికి ప్రజా భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ 'వోకల్ ఫర్ లోకల్' మంత్రాన్ని స్వీకరించి, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరారు. తద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థలు బలపడి 'ఆత్మనిర్భర్ భారత్' సాకారమవుతుందని పేర్కొన్నారు. సత్యసాయి బాబా ప్రేరణతో కరుణ, శాంతి మార్గంలో పయనిస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

## మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ..
# హైదరాబాద్‌కు కేంద్ర మంత్రి శుభవార్త

హైదరాబాద్, నవంబర్ 19 : భాగ్యనగర మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం ఖర్చును భరించుకోవాలని యోచిస్తున్నట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్‌లో అదనంగా 160 కిలోమీటర్ల మేర మెట్రో లైన్లను నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రులు, అధికారుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణతో కలిసి ఖట్టర్ విలేకరులతో మాట్లాడారు. "మెట్రో విస్తరణ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం. ఏ లైన్లకు ఆమోదం తెలపాలనేదానిపై మార్చి నాటికి కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది" అని ఖట్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ అండ్ టీ భాగస్వామ్యంతో ఉన్న హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసేందుకు ప్రాథమికంగా అంగీకారానికి వచ్చిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో మెట్రోను విస్తరించడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

*** విశాఖ, విజయవాడ మెట్రోలు, అమరావతి అభివృద్ధి**

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో కూడా మెట్రో ప్రాజెక్టులకు డిమాండ్ ఉందని మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. ఆ ప్రతిపాదనలను కూడా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. అమరావతిని ప్రధాన నగరంగా అభివృద్ధి చేసే ఆలోచన కూడా కేంద్రానికి ఉందని, ప్రస్తుత ప్రణాళికల ఆధారంగా అవసరమైన నిధులు అందిస్తామని హామీ ఇచ్చారు.

*** మూసీ ప్రక్షాళనకు కేంద్రం చేయూత**

మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలపైనా ఖట్టర్ మాట్లాడారు. "మొదటి దశలో 9 కిలోమీటర్ల మేర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేస్తాం. నీటి నాణ్యతను పర్యవేక్షించేందుకు ప్రతి 5 కిలోమీటర్లకు ఒక మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. మూసీ ప్రక్షాళనకు అమృత్ పథకం, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ద్వారా నిధులు సమకూరుస్తాం" అని వివరించారు. ఇదే సమయంలో, పట్టణాభివృద్ధికి కేటాయించిన నిధులను రాష్ట్రాలు సక్రమంగా ఎందుకు వినియోగించుకోవడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మూసీ నది నీటి నాణ్యతను పరీక్షించేందుకు ఒక టెస్టింగ్ ల్యాబొరేటరీకి ఆమోదం లభించిందని, హైదరాబాద్ మెట్రోకు 50:50 వాటా పద్ధతిపై చర్చలు జరిగాయని ధ్రువీకరించారు.

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు కసరత్తు
## ప్రారంభించిన ఎన్నికల సంఘం

ఢిల్లీ, నవంబర్ 19 : తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను ప్రకటించింది. రేపటి నుంచి ఈ నెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికలకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసే అవకాశం ఉంది. సోమవారం మంత్రి మండలిలో స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని మంత్రిమండలి నిర్ణయించిన నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ, ఎన్నికల సంఘం ఈ మేరకు దృష్టి సారించాయి.

## ఢిల్లీ పేలుడు...
# బయటకు వెళితే అనుమానంగా చూస్తున్నారు

హైదరాబాద్, నవంబర్ 19 : ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎర్రకోట సమీపంలో కారు పేలుడు తర్వాత కశ్మీరీలను అందరూ అనుమానంగా చూస్తున్నారని ఆయన అన్నారు. కొంతమంది చేసిన తప్పులకు కశ్మీరీలందరినీ బాధ్యులను చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఉగ్ర కుట్రలకు తమను ఎక్కడ బాధ్యులను చేస్తారేమో అనే భయంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కూడా కశ్మీరీలు భయపడుతున్నారని అన్నారు.

జమ్ము కశ్మీర్ నెంబర్ ఉన్న వాహనాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలన్నా తాను కూడా భయపడుతున్నానని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఢిల్లీలో జరిగిన పేలుడుకు కశ్మీర్‌లోని కొందరు బాధ్యులు కావడం వల్ల మొత్తం కశ్మీర్ ప్రజలు అందులో భాగమనే భావనను సృష్టిస్తున్నారని అన్నారు. తాను ఇతర రాష్ట్రాలకు వెళితే ఎవరు ఎక్కడ ఆపి వాహనాన్ని తనిఖీ చేస్తారోనని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తానని అన్నారు. ప్రస్తుతం జమ్ము కశ్మీర్ రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాన్ని ఢిల్లీలో నడపడం కూడా నేరంగా పరిగణిస్తున్నారని అన్నారు. అందరూ మనల్ని అనుమానాస్పద దృష్టితో చూస్తున్నప్పుడు, మనకు సంబంధం లేని అంశంలో మనల్ని కించపరుస్తున్నప్పుడు బయటకు వెళ్లడం కష్టమనిపిస్తుందని అన్నారు. అందుకే ప్రస్తుతం కశ్మీర్ ప్రజలు తమ పిల్లలను బయటకు పంపడానికి ముందుకు రావడం లేదని అన్నారు.

# మరింత పక్కాగా ప్రాక్టికల్స్

హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్స్‌పై మరింత కట్టుదిట్టమైన నిఘా పెట్టనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు చర్యలు చేపట్టింది. గత విద్యా సంవత్సరం సీసీ కెమెరాలను అమర్చి, బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించగా.. ఈ సారి ఫ్లయింగ్ స్క్వాడ్ల బృందాలను పెద్దసంఖ్యలో ఏర్పాటు చేయనున్నారు. వచ్చే ఫిబ్రవరి 2 నుంచి 21వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరంతోపాటు ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. దాదాపు 4 లక్షల మంది హాజరవుతారు. గత ఏడాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో బోర్డు నుంచి ప్రాక్టికల్స్ పర్యవేక్షణ కోసం డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించలేదు. దానికితోడు చివరి నిమిషంలో నిర్ణయం వల్ల అనేక ప్రైవేట్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోలేదు. ఈ సారి అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చనున్నారు. డిపార్ట్‌మెంటల్ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు పాఠశాల విద్యాశాఖ పరిధిలో, ఇతర గురుకులాలు ఆయా శాఖల పరిధిలో ఉంటాయి. వాటిల్లో సీసీ కెమెరాలున్నా బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం కాలేదు. ఒకవేళ ఏదైనా అక్రమం జరిగినా చర్య తీసుకునే అధికారం బోర్డుకు ఉండదు. అందుకే ఈ సారి వాటిల్లో ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలను తొలగించారు. వారంతా ఈ పరీక్షలకు ప్రభుత్వ కళాశాలలకు రావాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమైనందున వాటిల్లోనే ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం(202627) నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కూడా ప్రాక్టికల్స్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరాన్ని ఒక రిహార్సల్‌గా బోర్డు భావిస్తోంది. దానికితోడు సీసీ కెమెరాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ల నిఘా పెంచి ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలని భావిస్తున్నారు. తక్కువ రోజుల్లో పరీక్షలు పూర్తయ్యేలా ఎక్కువ కేంద్రాలను ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అరెస్టు

హైదరాబాద్, నవంబర్ 19 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలో గల సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన కవితను అదుపులోకి తీసుకున్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కవిత సింగరేణి భవన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపెండెంట్ ఉద్యోగులను పునరుద్ధరించాలని ఆమె అన్నారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని ఆమె విమర్శించారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కవితతో పాటు బైఠాయించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రైతులు కాలర్ ఎగరేసుకునేలా చేస్తా

పెండ్లిమర్రి: వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు తెస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. రైతులు పాత విధానాలను విడనాడి.. నూతన ఒరవడితో పంటలు సాగు చేసేలా ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. పంచ సూత్రాల అమలుతో రైతులు కాలర్ ఎగరేసుకుని తిరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలంలో 'పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ' కింద రెండో విడత నిధులను ముఖ్యమంత్రి బుధవారం విడుదల చేశారు. తొలుత కోయంబత్తూరు నుంచి ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం రెండో విడతగా ఒక్కొక్కరికి రూ.7వేల చొప్పున రూ.3,315 కోట్లను 46,85,838 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి



విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 'ఇప్పటివరకు రెండు విడతల్లో రూ.14 వేలు జమచేశాం. మూడోవిడతగా మరో రూ.6వేలు చెల్లిస్తాం. దీంతో ఏడాదికి రూ.20వేల సాయం అందుతుంది. వైకాపా పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగి రాష్ట్రానికి ఇబ్బందులు తలెత్తినా హామీలు అమలు చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు. 'రైతులంతా సాగులో సాంకేతికతను వినియోగించాలి. ఇందుకు పలు విధానాలు తీసుకొస్తాం. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రైతుల కోసం పనిచేస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. మరింతగా విస్తరించి పురుగు మందుల అవశేషాలు లేని పంటలను సాగు చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేద్దాం. రాయలసీమ ఎడారి అవుతుందన్నారు. రాయలసీమ ప్రజల్లో ఆశలు చిగురింపజేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఎన్ని ఇబ్బందులు వచ్చినా నదుల అనుసంధానం పూర్తిచేస్తా. రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ఉచిత విద్యుత్తుకు ఏటా రూ.10వేల కోట్లు వెచ్చిస్తున్నాం. జలవనరులు బాగా ఉన్నందున రూ.5వేల కోట్ల వరకు ఆదా అవుతాయి. వీటిని రైతుల కోసం వెచ్చిస్తాం' అని చంద్రబాబు తెలిపారు.

# జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్‌నాయక్‌కు ఘన స్వాగతం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విదేశీ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి జిల్లాకు వచ్చిన బంజార సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్‌కు జేఏసీ వైస్ చైర్మన్ వీరునాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లాలోకి ప్రవేశించే జూలూరుపాడు మండలం వద్ద నాయకులు, కార్యకర్తలు కలిసి శంకర్‌నాయక్‌కు పూలదండలు వేసి స్వాగతం పలికిన అనంతరం అక్కడి నుంచి సుజాతనగర్ మీదుగా కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్ వరకు భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి శంకర్‌నాయక్ పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. బంజారా సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు జేఏసీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది గిరిజనుల ఆరాధ్య దైవం అయినా శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే జాతర నిర్వహణ కోసం అవసరమైన స్థలం, నిధుల గురించి మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసి విన్నవించడం జరిగిందన్నారు. బంజారా యువకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అన్ని రాజకీయ పార్టీలలో ఉన్న బంజారా నాయకులు జేఏసీలో భాగస్వాములుగా ఉండాలనే ఆకాంక్షతో ప్రతి ఒక్కరికి స్థానం కల్పించడం జరిగిందన్నారు. అనంతరం వైస్ చైర్మన్ డాక్టర్ వీరు నాయక్ మాట్లాడుతూ రష్యా దేశంలో వైద్య విద్యార్థులకు పలు శిక్షణ తరగతులు నిర్వహించడంతోపాటు వివిధ అంశాలపై రీసర్చ్‌ను డాక్టర్ శంకర్ నాయక్ విజయవంతంగా పూర్తి చేసి ఇండియాకు తిరిగి వచ్చారన్నారు. ఆయన ఇదే విధంగా వైద్యరంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలవాలని కోరారు. అటు వైద్యరంగంతోపాటు ఇటు బంజరాల అభివృద్ధికి డాక్టర్ శంకర్‌నాయక్ చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జేఏసీ కో కన్వినర్లుగా నియమించబడిన జూలూరుపాడు మండలానికి చెందిన కొమ్ముగూడెం గ్రామ నివాసి బానోత్ కిషన్ నాయక్, మాచినపేట గ్రామ నివాసి లకావత్ నాగేశ్వరావు, లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామ నివాసి మోహన్ నాయక్‌లకు నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోభ్రియ నాయక్, చందర్ నాయక్, లాల్ సింగ్ నాయక్, కేశవ్ నాయక్, జయరాం చౌహన్, కాన్షిరాం నాయక్, మోహన్ నాయక్, రమేష్‌నాయక్, భరత్ నాయక్, శివ నాయక్, హనుమంతు నాయక్, కిషన్ లాల్ నాయక్, రమేష్ నాయక్, కిషన్ నాయక్, భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ గ్రోవ్ లో.. ఘనంగా రాణి లక్ష్మీబాయి జయంతి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రాంగణంలో రాణి లక్ష్మీబాయి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహిళల ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన రాణి లక్ష్మీబాయి జీవిత చరిత్ర ప్రతి విద్యార్థికి ప్రేరణ అన్నారు. అనంతరం విద్యార్థులు రాణి లక్ష్మీబాయి జీవితం, ఆమె వీర మరణం, ఝాన్సీ యుద్ధంలోని పాత్రను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు కూడా నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ పసుమర్తి సాయి చరిష్మా కు సన్మానం



ప్రజా స్ఫూర్తి , ఇల్లందు: ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో గత రెండున్నర సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్న డాక్టర్ పసుమర్తి సాయి చరిష్మాను బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ప్రొద్దుటూరి నాగేశ్వరరావు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ ధ్యేయంగా వైద్య సేవలను అందిస్తున్న యువ వైద్యురాలిని అభినందిస్తూ, ఇటీవలి కాలంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం గర్వకారణమన్నారు. సేవాభావంతో ముందుకు సాగుతూ భవిష్యత్తులో మరెన్నో సేవలను పేద ప్రజలకు అందిస్తారన్న నమ్మకం వ్యక్తం చేశారు.అనంతరం డాక్టర్ సాయి చరిష్మాకు మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ, యువజన సంఘం అధ్యక్షులు అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను బాబు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్కు వినతి



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని బుధవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరిని కలిసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా అల్లాపూర్ డివిజన్లోని ముస్లిం గ్రేవియార్డ్ కు (యూసఫ్ నగర్ ) సంబంధించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతము చేయాలన్నారు. కేపిహెచ్బి డివిజన్లోని రమ్య గ్రౌండ్ లో టి.ఎస్ హౌసింగ్ బోర్డు ఎమ్యూనిటీస్ స్థలము హ్యాండోవర్ చేసుకొని పాఠశాల నిర్మాణానికి సంబంధించి పనులకు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతము చేయాలని, నిరుపేదలకు ఉపయోగపడే పాఠశాల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఇప్పటికే పాఠశాల నిర్మాణం కొరకు పునాదులు వేసామని పనులు ముందుకు సాగక అక్కడ అస్తవ్యస్తంగా తయారైందని పాఠశాల నిర్మాణం పూర్తయితే ఎంతో మంది నిరుపేదలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు ,సబియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## గుంతలు పడ్డ రోడ్లు బాగు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

* **కొత్తగూడెం కార్పొరేషన్లో సమస్యలు పరిష్కరించాలని వినతి**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గత మూడు నెలల కాలం నుంచి భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా గుంతలమయమైన రోడ్లను బాగు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టడం జరిగిందని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి రామవరం గోధుమ వాగు బ్రిడ్జి మీద నిరసన తెలిపారు. పాడైన రోడ్లు బాగు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ మేనేజర్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. (కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో) సీతాలక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికల పార్టీ ఇంచార్జి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సూచనల మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రోడ్లు బాగు చేయాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా అధికారుల తీరులో మార్పు రావడం లేదని మండిపడ్డారు. తక్షణమే కొత్తగూడెం కార్పొరేషన్ వ్యాప్తంగా గుంతలు పడ్డ రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలని, రామవరంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. కార్పొరేషన్ వ్యాప్తంగా పాడయిన చోట స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం తవ్విన సీసీ రోడ్లను తిరిగి నిర్మించి పంపు కనెక్షన్లు ఇవ్వాలన్నారు. మూలనపడ్డ పారిశుధ్య ట్రాలీలకు మరమ్మతులు చేసి వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ కార్మికులకు ఇవ్వాల్సిన సామాగ్రిని అందజేయాలని తెలియపరిచారు.ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, మాజీ కౌన్సిలర్లు ప్రసాద్, అంబుల వేణు, తోగరు రాజశేఖర్, తాండ్ర శీను, పల్లపురాజు దూడల కిరణ్, హుస్సేన్, పిల్లి కుమార్, రామిళ్ళ మధు, మునీర్, తమ్మిశెట్టి అశోక్, మద్దెల సుధీర్, వెంకటరమణ, రిజ్వాన్, అజ్మీర విజయ్, బుద్ధి మధుసూదన్ రావు, పేరం సందేశ్, వంటేరు కళ్యాణ్, పూర్ణచందర్ నాయక్, మనోజ్, సిద్ధు, అనీష్, హైమద్, అజ్జు, రిజ్జు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 108 వ జయంతి సందర్భంగా ఇల్లందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు ఇల్లందు జగదాంబ సెంటర్ నందు పాత లింగాల గ్రామం రామ్ రెడ్డి నివాస నందు వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళిఘటించిన ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య .తెలంగాణ రాష్టం అగ్రికల్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామ్ రెడ్డి గోపాల్ రెడ్డి.వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు.ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్,మాజీ మున్సిపల్ చైర్మెన్లు యదలపల్లి అనసూర్య,దమ్మాలపాటి వెంకటేశ్వరావు,ఇల్లందు టౌన్,మండలం అధ్యక్షులు దొడ్డా డానియల్,పులి సైదులు,కామేపల్లి మండల పార్టీ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీనివాస్ పూనెం సురేందర్,బండి ఆనంద్,ఇల్లందు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఈసం లక్ష్మణ్,తాటి భిక్షం,మూతి క్రిష్ణ,పొటు రవి,ఎట్టి హరికృష్ణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బుల్లి రాజు కుంజ వసంతరావు,మాళోత్ బావు సింగ్,ఇల్లందు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పూనెం మధు,ధనసరి రాజు, మాజీ సర్పంచులు కల్తి పద్మ పాయం స్వాతి పాయం లలిత,ధనసరి స్రవంతి,నాయకురాలు బానోత్ శారద,మడుగు వెంకటలక్ష్మి,టౌన్,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప,మోకాళ్ళ వెంకటమ్మ మాజీ కార్పొరేటర్ కుక్కు నాగేశ్వరరావు,సుదర్శన్ కోరి,కామేపల్లి మండల కాంగ్రెస్ కమిటీ టీం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 10వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు ఐరా గ్లోబల్ స్కూల్ యాజమాన్యం అరుణశ్రీకాంత్ దంపతుల కుమార్తె మాన్విత పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్ళెం నాగరాజు గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, మార్గం శేఖర్ యాదవ్, బందారపు శివగౌడ్, అందోజు సన్నిధ్ చారి, బొడిగె భాను గౌడ్, చెరుకు చైతన్య, చందు గౌడ్, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ ఎల్ఐసి బ్రాంచ్‌లో ప్రపంచ పురుష దినోత్సవం వేడుకలు




వికారాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ప్రపంచ పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వికారాబాద్ ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది కలిసి పురుష అధికారులు చేత కేక్ కట్ చేయిస్తూ ప్రత్యేకంగా రోజును జరిపారు. బ్రాంచ్ మేనేజర్ శ్రీరాములు మాట్లాడుతూ మహిళా సిబ్బంది ముందుకొచ్చి పురుషుల దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నేటి సమాజంలో స్త్రీ-పురుషులు సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ బాధ్యతల్లో ఇద్దరూ సమానంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ ప్రపంచ పురుష దినోత్సవం ఉన్నప్పటికీ ఇలాంటి వేడుకలు ఎక్కడా జరగకపోవడం సాధారణమని, అయితే బ్రాంచ్‌లో మొదటిసారిగా నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు.లియాఫీ అధ్యక్షులు వెంకటరెడ్డి మాట్లాడుతూ, పురుషులు, మహిళలు, తల్లులకు ప్రత్యేక దినాలు జరుపుకోవడం ఒక సామాజిక ఆనవాయితీగా మారిందని అన్నారు. ఏ రంగంలోనైనా పరస్పర సహకారంతో, సోదర భావంతో పనిచేస్తే సమాజాభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏబీఎం సుందర్ కుమార్, ఏవోలు రాఘవేంద్ర, గీత, ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ సత్యనారాయణ, అధికారులు విజయలక్ష్మి, రమణి, హాసిక, మౌనిక, కవిత, పార్వతప్ప, గోపికృష్ణ, బుచ్చయ్య, వినోద్ కుమార్, పూర్ణానంద సాయి, హనుమయ్య, యుగేష్, లూయిస్, రాజ్ కుమార్, సిబ్బంది దేవేందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పొగ మంచు వాతావరణంలో ప్రయాణాలు చేసే వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: శీతాకాలంలో దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై విజిబిలిటీ బాగా తగ్గుతుంది.వాహనదారులు తమ భద్రతను దృష్టిలో ఉంచుకుని అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తెల్లవారు ఝామున దట్టమైన పొగమంచు కురిసే సమయంలో ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం కాదని,వాయిదా వేసుకోవడం మంచిదన్నారు. వాహనాలను నిదానంగా నడపాలన్నారు. మీ వాహనం యొక్క ఫాగ్ లైట్లు,పార్కింగ్ లైట్లతో పాటు తక్కువబీమ్ హెడ్‌లైట్లను మాత్రమే ఉపయోగించండి.హైబీమ్ లైట్లు పొగమంచులో మరింత ప్రతిబింబించి,విజిబిలిటీని తగ్గిస్తాయన్నారు. కారులో హీటర్ ను ఆన్ చేసుకుని,ఎల్లప్పుడూ అద్దాలు శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందు వెళుతున్న వాహనానికి కనీస దూరాన్ని పాటిస్తూ,ఆ వాహన సిగ్నల్స్ ను గమనిస్తూ ఉండాలన్నారు. పొగమంచు అధికంగా కురిసే సమయంలో ఓవర్ టేక్ చేయడం మంచిది కాదన్నారు. అత్యవసరంగా రోడ్డు ప్రక్కన ఆగాల్సి వస్తే,రోడ్డుకు దూరంగా ఆపి,హజార్డ్ లైట్లను వేసి ఉంచాలన్నారు.

## పూర్వీకులు మన ప్రయోజనాలను కోరి
# అనేక ఆచారాలను, సంప్రదాయాలను ఏర్పరిచారు

* **సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ**
* **ఘనంగా గాజులరామారం పద్మశాలి కార్తీకమాస వనభోజన మహోత్సవం**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పూర్వీకులు మన ప్రయోజనాలను కోరి అనేక ఆచారాలను, సంప్రదాయాలను ఏర్పరిచారని సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. గాజులరామారం డివిజన్ లో జరిగిన పద్మశాలి కార్తీకమాస వనభోజన మహోత్సవం నకు సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ముఖ్య అతిధిగా హాజర య్యారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు స్వాగతం పలికారు. కార్యక్రమ నిర్వాహకులు, ప్రజలు వారిని సాదరంగా ఆహ్వానించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నిర్వాహకులు శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ సామూహిక జీవన విధానాన్ని అలవాటు చేసే వన భోజన కార్యక్రమం అలాంటిదేనని అన్నారు. వన భోజనాలకు వచ్చిన వారికి పేరుపేరునా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆ రోజుల్లో ప్రజలు ఆధ్యాత్మిక, సామాజిక ప్రయోజ నాలను ఆశించి వన భోజనాలు జరుపు కునేవారని అన్నారు. కానీ కాల క్రమంలో కులాల వారీగా వన భోజనాలు జరుపు కునే ఆచారం వచ్చిందని తెలిపారు. ఒకరి కోసం అందరూ, అందరి కోసం ఒకరూ సహకరించుకుంటూ పోతే ప్రజల మధ్య సహృద్భావ సంబంధాలు పెంపొంది వసు దైక కుటుంబంగా వర్ధిల్లుతాతమనీ, సత్సంబంధాలు పెరిగి ఉన్నతంగా ఎదగడానికి తోడ్పడుతుందని స్పష్టం చేశారు. వన భోజనాలతో ప్రజల మధ్యసాన్నిహిత్యం పెరిగి, వైవాహిక సంభందాలతో కుటుంబ బంధాలు మరింత బలపడతాయని మంత్రి సత్యనారాయణ అన్నారు. వన భోజనాలనునిర్వహించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. తనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షులరాలు గుంటుక రూప,పద్మశాలి సంఘం మహిళా పట్టణ అధ్యక్షురాలు పరంఢ్ల శారదా, పద్మశాలి సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షులు గుండేటి శ్రీధర్, గాజులరామారం పద్మశాలి సంఘం నాయకులు సాయినాథ్ నేత, కస్తూరి బాలరాజు, తెలంగాణ సాయి, సీనియర్ జర్నలిస్ట్ లు ఈనాడు శ్రీనివాస్, టి రమేష్, బూరెలా ముకేశ్, దూలప్ప, శ్రీదేవి నాగభూషణం, పాండు, జి రాజశేఖర్,టాక్స్ శ్రీనివాస్, గోసిక్ శ్రీనివాస్ తో పాటు పలువురు పాల్గొన్నారు.



## భగత్ సింగ్ నగర్ ను మరింత అభివృద్ధి పథంలో
# ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలి

* **జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్**

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : భగత్ సింగ్ నగర్ ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు సంక్షేమ సంఘం నాయకులు కృషి చేయాలని జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్ అన్నారు. ఇటీవల చింతల్ డివిజన్ పరిధి భగత్ సింగ్ నగర్ లో నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం నాయకులకు హడక్ కమిటీ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్ కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై నూతనంగా ఎన్నికైన భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం నాయకులను ఘనంగా సత్కరించారు. అనంతరం సిఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రెండు సంవత్సరాలలో భగత్ సింగ్ నగర్ కాలనీ ని మోడల్ కాలనీ గా తీర్చిదిద్దాలని అన్నారు కాలనీలో ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అధ్యక్షుడు పచ్చిమట్ల నరేందర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాప్ రెడ్డి, మాజీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి సత్యం, కే. శ్యామల, ఎల్లారెడ్డి, బీసు వెంకటేశం గౌడ్, డాక్టర్ పెండెం నాగభూషణం, కుడికల సహదేవ్, పి. వెంకట్ రెడ్డి, బత్తిని శ్రీధర్ గౌడ్, మడ్డి వెంకటేశ్వర్లు గౌడ్, చంద్రమౌళి, భూమయ్య, దేవయ్య, వై ప్రవీణ్ కుమార్ గౌడ్, ఆంజనేయులు, ఇస్మాయిల్ , హడాక్ కమిటీ సభ్యులు తో పాటు కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# జర్నలిస్టుల, ప్రాణాలు పోతున్నయి

* **హెల్త్ కార్డులు అమలు అయ్యేలా చర్యలు తీసుకోండి**

రంగారెడ్డి, (ప్రజాస్ఫూర్తి) : రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డు, అక్రిడిటేషన్ కార్డు , ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలనీ టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది.రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎండీ. సలీమ్ పాషా ల నేతృత్వంలో బుధవారం మణికొండ లో మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లకు విన్నపించారు.రంగారెడ్డి జిల్లా పరిధిలో వివిధ ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నో సంవత్సరాలుగా అంకిత భావంతో పని చేస్తున్న జర్నలిస్టులు సామాజిక సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితులు వంటి అంశాలను ఎల్లప్పుడూ ముందుండి ప్రజలకు చేరవేస్తున్నారు. ప్రజలతో ప్రభుత్వం మధ్య వారధి పాత్రను భాద్యతగా నిర్వహిస్తున్నారు. జిల్లా అంతటా పనిచేస్తున్న అనేక మంది జర్నలిస్టులు హెల్త్ కార్డులు , ప్రభుత్వ గుర్తింపు కార్డులు నూతనంగా రాకపోవటంతో , ఇళ్ల స్థలాలు/హౌసింగ్ ప్లాట్లు వంటి మౌలిక ప్రయోజనాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి వివరించారు.ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యత వహిస్తున్న జర్నలిస్టులు కూడా సామాజిక భద్రత, వైద్య సౌకర్యాలు మరియు స్థిరమైన నివాసం వంటి మౌలిక సదుపాయాలు పొందాల్సిన అవసరం చాలాకాలంగా ఉందని ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారించాలని కోరారు.హెల్త్ కార్డ్ పని చేయక పోవడం వలన రిపోర్టర్స్ ఇబ్బంది పడుతున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ వి 6 రిపోర్టర్ నర్సింగ్ రావు గుండె పోటుకు గురై స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని,తక్షణం ఆదుకోవాలని కోరారు.అదేవిదంగా ఉద్యోగుల మాదిరిగా అందరికీ హెల్త్ కార్డ్ అమలు అయ్యేలా చూడాలని విన్నపించారు..ఇటీవలే షాబాద్ మండలానికి చెందిన రిపోర్టర్ రాములు గుండె పోటుతో మృతి చెందారు.వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు.వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.మంత్రిని కలిసిన వారిలో జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు భీమయ్య, సీనియర్ నేతలు సూర్యనారాయణ, రాజేందర్ రెడ్డి, రాజు, విష్ణు ల, రాము, శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు..

## ముత్యపు పందిరి వాహనంపై దర్శనమిచ్చిన
# శ్రీ పద్మావతీ దేవి అమ్మవారు

**తిరుమల: శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొగసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ముత్యపు పందిరి వాహనంపై పద్మావతీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు పలు కళాబృందాల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆ చిత్రాలు.**









# భవిష్యత్తు తరాలకు మేలు చేసేలా విజన్ డాక్యుమెంట్: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: రాష్ట్రం రెండేళ్లలో సాధించిన ప్రగతి, భవిష్యత్తును ప్రపంచానికి చూపడమే తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో 2047 విజన్ డాక్యుమెంట్‌పై సమావేశం నిర్వహించారు. మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్య సాధన కోసం అడుగులు వేస్తున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. ఐఎస్‌బీ అధికారులు.. వివిధ శాఖలను సంప్రదించి ప్రాథమిక కసరత్తు పూర్తి చేశారన్నారు. తెలంగాణను ఎలా తీర్చిదిద్దనున్నామో డాక్యుమెంట్ ద్వారా వివరించాలని నిర్ణయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రెండేళ్లలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం తదితర విషయాలను డాక్యుమెంట్‌లో ప్రస్తావించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. డిసెంబరు 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల నిపుణులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. వివిధ శాఖల కార్యదర్శులు, మంత్రులతో చర్చించి విజన్ డాక్యుమెంట్‌కు తుది రూపు తీసుకురావాలని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, సీఎస్ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.



## ఐటీ సోదాలు.. పిస్తాహౌస్ యాజమాని ఇంట్లో రూ.5 కోట్లు గుర్తింపు

హైదరాబాద్: పన్నుల ఎగవేత అనుమానంపై నగరంలోని ప్రముఖ బిర్యానీ హోటళ్ల యజమానుల ఇళ్లలో ఆదాయపన్నుశాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే పిస్తాహౌస్ యజమాని ఇంట్లో రూ.5 కోట్లు గుర్తించారు. అంతకుముందు పిస్తా హౌస్, మెహ్‌ఫిల్, షాగౌస్ హోటళ్లలో చేపట్టిన తనిఖీల్లో పెద్ద సంఖ్యలో హార్డ్‌డిస్కులు, వ్యాపార లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం




చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మూడు హోటళ్లలోనూ ఆన్‌లైన్ ద్వారా తీసుకున్న ఆర్డర్లకు సంబంధించి సరైన వివరాలు లేవని గుర్తించారు. మొత్తం 30 ప్రాంతాల్లో జరిగిన ఈ సోదాల్లో 35కి పైగా బృందాలు పాల్గొన్నాయి. స్వాధీనం చేసుకున్న హార్డ్‌డిస్కులు తదుపరి దర్యాప్తులో కీలకం కానున్నాయి.

## హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అంటున్నారు: ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్: ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ''మావోయిస్టుల ఎన్‌కౌంటర్లను తక్షణమే ఆపివేయాలి. ఎన్‌కౌంటర్లపై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నాం. మావోయిస్టుల పక్షాన న్యాయ పోరాటం చేస్తాం. హిడ్మా కోరితే ఆశ్రయం ఇచ్చే వాళ్లం. అతన్ని నేనే డీజీపీకి సరెండర్ చేయించే వాడిని. హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అంటున్నారు. ఎన్‌కౌంటర్ అంటే పరస్పరం కాల్పులు జరపడం.



ఏకపక్షంగా కాల్పులు జరపడాన్ని బండి సంజయ్ ఎన్‌కౌంటర్ అంటున్నారు. మావోయిస్టులతో చర్చించి సమస్యలను తెలుసుకోవాల్సింది పోయి చంపుతున్నారు. 2026 మార్చి కల్లా మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అంతం చేయడానికి ఇదేమైనా యుద్ధమా? కాల్పులు విరమించుకుంటున్నామని ప్రకటించినా చంపుతున్నారు. దండకారణ్యంలో ఖనిజాల కోసమే మావోయిస్టులను చంపుతున్నారు'' అని కూనంనేని ఆరోపించారు.

## స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు

స్కిల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణను మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటం కంప్యూటింగ్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దేలా కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌ఐసీ)లో నిర్వహించిన స్కిల్ కాన్వకేషన్ ఇన్ ఐటీ/ఐటీఈఎస్ సెక్టార్ అండ్ ఏఐ, డిజిటల్ టెక్నాలజీస్ హ్యాకథాన్ 2025ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టెక్నాలజీ రోజురోజుకూ వేగంగా మారుతున్నదని, ఆ మార్పులను అందిపుచ్చుకోగలిగితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. రెండేళ్లలోనే 40 శాతానికి పైగా అంతర్జాతీయ కంపెనీలు జనరేటివ్ ఏఐని తమ కోర్ వర్క్‌లో భాగం చేసుకున్నాయన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయన్నది అపోహే అని, అది కేవలం ఉద్యోగాల స్వరూపాన్ని మాత్రమే మారుస్తుందన్నారు. ఆటోమేషన్



వల్ల 85 మిలియన్ జాబ్స్ పోతే, కొత్తగా 97 మిలియన్ల స్కిల్ బేస్డ్ ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తేల్చిందని గుర్తు చేశారు. సంక్షోభంతో పాటే కొత్త అవకాశాలు కూడా వస్తాయని, అందుకు సంసిద్ధంగా ఉండాలని యువతకు సూచించారు. ఓ వైపు సైబర్ క్రైమ్స్ రోజురోజుకూ పెరుగుతున్నాయని, మరోవైపు ఎథికల్ హ్యాకర్లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులకు భారీ డిమాండ్ ఏర్పడుతుందన్నారు. వాతావరణ మార్పుల వల్ల క్లీన్ టెక్, ఈవీలు, గ్రీన్ ఇన్నోవేషన్ రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. అలా అని ఈ డిజిటల్ యుగంలో కేవలం అకడమిక్ డిగ్రీలతో మాత్రమే ఉద్యోగాలు రావని, ఇన్నోవేషన్, ప్రాబ్లం సాల్వింగ్, ప్రాక్టికల్ స్కిల్స్ ఉంటేనే సక్సెస్ సాధ్యమన్నారు. తమ ప్రభుత్వం స్కిల్లింగ్ ఎకో సిస్టంను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మార్కెట్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్‌ను తయారు చేసే బాధ్యతను భుజానికి ఎత్తుకుందని వివరించారు. కార్యక్రమంలో ఈఎస్ఐసీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడలో విషాదం..
## లిఫ్టులో ఇరుక్కొని బాలుడి మృతి



హైదరాబాద్: నగరంలోని ఎల్లారెడ్డిగూడలో విషాద ఘటన చోటుచేసుకుంది. కీర్తి అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్‌లో ఇరుక్కొని బాలుడు మృతి చెందాడు. అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తులో నివాసం ఉండే నరుసు నాయుడు చిన్న కుమారుడు హర్షవర్ధన్ (5) మధురానగర్‌లోని శ్రీనిధి పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి తల్లి, సోదరుడితో పాటు ఇంటికి వచ్చిన బాలుడు లిఫ్ట్‌లో అయిదో అంతస్తులోకి వెళ్లాడు. తిరిగి కిందికి దిగుతున్న క్రమంలో 4, 5 అంతస్తుల మధ్య లిఫ్ట్‌లో ఇరుక్కుపోయాడు. వెంటనే బాలుడిని బయటకు తీయగా.. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి మృతితో అపార్ట్‌మెంట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఐ-బొమ్మ కేసు..
## రవి కస్టడికి నాంపల్లి కోర్టు అనుమతి

హైదరాబాద్: ఐబొమ్మ కేసులో అరెస్ట్ అయిన ఇమంది రవిని కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐబొమ్మ కీలక సూత్రధారిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రవిని ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు.. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ విచారణలో మరికొన్ని కీలక అంశాలు వెలుగు చూసే అవకాశముంది. ఇప్పటికే ఇమంది రవి కేసుపై ఈడీ దృష్టి సారించింది.



## మారుతున్న జీవన శైలికి అనుగుణంగా
## ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

: మంత్రి దామోదర్ రాజనర్సింహ

మారుతున్న జీవన శైలిలో భాగంగా ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానికుందన్నారు. బుధవారం సచివాలయంలో



సెక్రటేరియట్ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం రేనోవా హాస్పిటల్స్ సౌజన్యంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏఐ బేస్డ్ మెగా కార్డియాక్ హెల్త్ క్యాంపును మంత్రి ప్రారంభించారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్ వైద్య సేవలను ఉచితంగా అందించారు. సచివాలయ ఉద్యోగులతో పాటు అధికారులు సైతం క్యాంపులో పరీక్షలు చేయించుకున్నారు. ఇదే క్యాంపులో ఎంపీ బలరాం నాయక్ పాల్గొని అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకొని హెల్త్ క్యాంప్ ఏర్పాటును అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీగిరి శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రేమ్, కార్యవర్గ సభ్యులు, వైద్యులు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు..

## ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి...
## ఖండించిన మంత్రి పొన్నం



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామం వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగిపై ఉద్దేశ్యపూర్వకంగా దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీతో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లో మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆర్టీసీ సోదరులపై దాడి ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం మనోధైర్యాన్ని కల్పించారు.

## త్వరలోనే ఎన్నికలు..
## సిద్ధం కావాలని కార్యకర్తలకు కేటీఆర్ పిలుపు

ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు అక్రమాలకు పాల్పడ్డాయని.. కర్ణాటక నుంచి మనుషులను తెచ్చి దొంగ ఓట్లు వేయించుకున్నారని.. షేక్‌పేట, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల్లో రిగ్గింగ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని, డబ్బు, మద్యం పంచి గెలిచారని. ఇది నైతిక గెలుపు కాదని ఆయన విమర్శించారు. వ్యక్తిగత విషాదంలో ఉన్నా హరీశ్‌రావు పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికల ఫలితాలు, పార్టీ బలోపేతంపై చర్చించేందుకు తెలంగాణ భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, ఇతర ఎమ్మెల్యేలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గోపీనాథ్ మరణం తర్వాత పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలిచిందని




గుర్తు చేశారు. గోపీనాథ్ సతీమణి సునీతమ్మ గెలుపు కోసం కేసీఆర్ నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పనిచేశారని ప్రశంసించారు. రేపు రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం, ఎమ్మెల్యే ఎన్నికల్లో వారు పడ్డ కష్టానికి మించి తాము పని చేస్తామని, కాలికి బలపం కట్టుకొని తిరుగుతామని భరోసా ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లోపు సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, ఆ వెంటనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లోని 407 బూతుల్లో ఒక్కో బూత్‌కు 10 మంది చొప్పున, మొత్తం 4 వేల మందితో పటిష్టమైన సైన్యాన్ని నిర్మించుకోవాలని సూచించారు. గతంలో నష్టపోయిన చోటే తిరిగి బలాన్ని పుంజుకోవాలని, ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలనే సామెతను గుర్తు చేస్తూ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజల సమస్యలపైనా ఇప్పటి నుంచే పోరాటం మొదలుపెట్టాలని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేయాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ కర్ణాటక చీఫ్‌గా శాశ్వతంగా ఉండలేను: డీకే శివకుమార్

కేపీసీసీ అధ్యక్ష పదవి నుంచి తాను దిగిపోవచ్చని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంకేతాలు ఇచ్చారు. ఈ పదవిలో తాను శాశ్వతంగా ఉండలేనని పేర్కొన్నారు. పార్టీని నడిపించే విషయంలో మాత్రం ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటానని చెప్పారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈమేరకు ప్రసంగించారు. రాష్ట్రంలో సీఎం మార్పుపై ఊహాగానాల వేళ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''కాంగ్రెస్ కర్ణాటక చీఫ్ పదవిలో శాశ్వతంగా ఉండలేను. ఇప్పటికే ఐదున్నరేళ్లు అయ్యింది. మరికొద్ది నెలల్లో ఆరేళ్లు పూర్తవుతుంది. ఇతరులకూ అవకాశం ఇవ్వాలి. 2023 మే నెలలో ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని అనుకున్నాను. కానీ.. పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత రాహుల్ గాంధీ మరికొంత కాలం కొనసాగాలని కోరారు. కేపీసీసీ అధ్యక్ష పదవిలో నేను ఉన్నానా? లేదా? అనేది ముఖ్యం కాదు. పార్టీ నాయకత్వం విషయంలో ముందు వరుసలో ఉంటాను. నా



పదవీకాలంలో 100 పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనుకుంటున్నాను'' అని డీకే శివకుమార్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని డీకే ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఆశావహ దృక్పథంతో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం తన వ్యాఖ్యలపై మీడియాతో మాట్లాడుతూ.. తాను బాధ్యతల నుంచి తప్పించుకోవడం లేదన్నారు. ''ఇక్కడ ఎవరూ శాశ్వతంగా ఉండలేరు. నేను పారిపోయే వ్యక్తిని కాదు. గాంధీ కుటుంబం, కాంగ్రెస్ అధ్యక్షుడు కోరుకున్నంత వరకు పని చేస్తాను'' అని చెప్పారు. బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కర్ణాటక రాజకీయాల్లో మార్పులు, చేర్పులు ఉంటాయని మొదటి నుంచి ప్రచారం జరుగుతోంది. పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో సీఎం సిద్ధరామయ్య భేటీ అయ్యారు. ముఖ్యమంత్రిగా తానే పూర్తి కాలం కొనసాగేందుకు అవకాశం ఇవ్వాలని పరోక్షంగా అధిష్ఠానాన్ని కోరిన ఆయన.. తదుపరి ఎన్నికలకు డీకేను సీఎం అభ్యర్థిగా ప్రతిపాదిద్దామని సూచించినట్లు సమాచారం. మరోవైపు.. పార్టీ అధిష్ఠానం తనను ఏ విషయమైనా అడిగేంత వరకు మౌనంగా ఉండాలని శివకుమార్ భావిస్తున్నారు.

## భారత్‌కు రానున్న డొనాల్డ్ ట్రంప్ జూనియర్



ఉదయ్‌పూర్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారం భారత్‌లో పర్యటించనున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నవంబర్ 21, 22 తేదీల్లో జరిగే ఓ అమెరికన్ వ్యాపారవేత్త కుమారుడి వివాహానికి కుటుంబ సమేతంగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా సీక్రెట్ సర్వీసెస్‌కు చెందిన ఓ బృందం ఇప్పటికే ఉదయ్‌పూర్‌కు చేరుకొని ఏర్పాట్లను సమీక్షిస్తున్నట్లు తెలిసింది. ఉదయ్‌పూర్‌కు సరస్సుల నగరంగా పేరు. ఇక్కడి పిచోలా సరస్సు మధ్య ఉన్న జగ్ మందిర్ ప్యాలెస్‌లో ఓ అమెరికా వ్యాపారవేత్త కుమారుడి డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుంది. ఇందుకోసం తొలిసారిగా భారత్‌కు రానున్న ట్రంప్ జూనియర్.. లీలా ప్యాలెస్‌లో విడిది చేయనున్నట్లు సమాచారం. ఈయనతో పాటు ఈ వివాహ మహోత్సవానికి అనేక మంది రాజకీయ నేతలు, వివిధ రంగాల ప్రముఖులు కూడా హాజరవనున్నారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం నుంచి ప్యాలెస్ వరకు నగర పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

## అమ్మాయిలు అలా చేయడం తప్పా..?
# చర్చనీయాంశమైన పోస్టుపై ఉపాసన

పెళ్లికి సంబంధించి అపోలో సీఎస్ఆర్ వైస్ ఛైర్‌పర్సన్, నటుడు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన ఇటీవల పెట్టిన ఓ పోస్టు చర్చనీయాంశమైంది. జోహో సీఈఓ శ్రీధర్ వెంబు లాంటి ప్రముఖులు సహా ఎంతోమంది నెటిజన్లు దానిపై స్పందించారు. కొందరు ఉపాసనను విమర్శించగా.. మరికొందరు మద్దతుగా కామెంట్లు పెట్టారు. ఆ భిన్నాభిప్రాయాలపై ఉపాసన తాజాగా రియాక్ట్ అవుతూ మరో పోస్టు పెట్టారు. ''నా పోస్టుపై ఆరోగ్యకర చర్చను లేవనెత్తినందుకు ఆనందిస్తున్నా. స్పందించిన వారికి థాంక్స్'' అంటూ పలు ప్రశ్నలు సంధించారు. 'ఫ్యాక్ట్ చెక్' పేరిట



తన వివాహం, సంతానానికి సంబంధించిన ప్రణాళికలను వెల్లడించారు. ''సరైన భాగస్వామి ఎదురయ్యే వరకూ అమ్మాయి వేచి చూడటం తప్పా?', 'పిల్లలకు ఎప్పుడు జన్మనివ్వాలన్నది పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం తప్పా?'' అంటూ పలు ప్రశ్నలను సంధించారు. ''27 ఏళ్ల వయసులో వివాహం చేసుకున్నా. వ్యక్తిగత, ఆరోగ్య కారణాల వల్ల 29 ఏళ్ల వయసులో నా ఎగ్స్‌ను ఫ్రీజ్ చేయాలని నిర్ణయించుకున్నా. 36వ ఏట ఓ బిడ్డకు జన్మనిచ్చా. ప్రస్తుతం నాకు 39 ఏళ్లు. త్వరలో కవలలకు జన్మనివ్వబోతున్నా. వ్యక్తిగత జీవితానికి ఎంత ప్రాధాన్యమిచ్చానో కెరీర్ నిర్మాణానికి అంతే. నా దృష్టిలో పెళ్లి కెరీర్ ఒకదానితో మరొకటి పోటీ కాదు. కానీ, ప్రతిదానికీ ప్రత్యేక సమయం ఉంటుందని భావిస్తున్నా'' అని పేర్కొన్నారు. ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులతో ఇటీవల ముచ్చటించిన ఉపాసన..సంబంధిత వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. పెళ్లి చేసుకుంటున్నారా..? అని అడిగిన ప్రశ్నకు అమ్మాయిల కంటే అబ్బాయిలే ఎక్కువగా చేతులు పైకెత్తారని ఆమె వెల్లడించారు. ''మహిళలు కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టారని దీనిని బట్టి అర్థమైంది. ఇది సరికొత్త భారత్'' అని పోస్టులో ఆమె రాసుకొచ్చారు. అమ్మాయిలకు పెద్ద ఇన్సూరెన్స్ అండాలు దాచిపెట్టుకోవడమని, దానివల్ల ఎప్పుడు పిల్లల్ని కనాలన్నది తమ చేతుల్లోనే ఉంటుందని వీడియోలో చెప్పారు. ఆర్థికంగా స్థిరపడిన తర్వాత పెళ్లి చేసుకోవడం మంచిదని అభిప్రాయపడ్డారు.

## పట్టపగలే చోరీ..
### పన్ను అధికారులంటూ రూ.7కోట్లతో పరారీ

బెంగళూరు (చిత్రదుర్గం): పట్టపగలే నడిరోడ్డుపై భారీ దొంగతనం జరిగింది. పన్ను అధికారులమంటూ వచ్చిన దుండగులు ఏడు కోట్ల రూపాయలతో పరారీ అయ్యారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. బెంగళూరులోని జేపీ నగర్‌లో ఉన్న ఒక ప్రైవేటు బ్యాంక్ బ్రాంచ్ నుంచి క్యాష్‌వ్యాన్‌లో ఏటీఎంకు నగదు తరలిస్తున్నారు. ఆ వ్యాన్ అశోకా పిల్లర్ ప్రాంతంలో ఉండగా.. అకస్మాత్తుగా ఒక కారు అడ్డుగా వచ్చింది.




అందులో వ్యక్తులు నగదు ఉన్న వాహనం వద్దకు వచ్చి.. పన్ను విభాగ అధికారులమని, పత్రాలు చూపించాలని హడావుడి చేశారు. వ్యాన్ సిబ్బంది స్పందించేలోపే.. వారిని, డబ్బును కారులోకి బలవంతంగా ఎక్కించారు. కొంతదూరం కారుపోనిచ్చి, ఆ సిబ్బందిని బలవంతంగా దింపేశారు. తర్వాత ఆ డబ్బుతో పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపడుతున్నాయి. సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నాయి. కరడుగట్టిన దోపిడీ ముఠాలు దీనివెనక ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

## స్థానిక ఎన్నికలకు
# వీవీప్యాట్‌లు తప్పనిసరేం కాదు మహారాష్ట్ర ఎస్ఈసీ

మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (SEC) కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఎన్నికలకు వీవీప్యాట్‌లు (ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) తప్పనిసరి కాదని తెలిపింది. అంతేకాదు.. సాంకేతికంగా అది సాధ్యం కాదని పేర్కొంటూ ఈ మేరకు బాంబే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగిస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్.. వీవీప్యాట్‌లను ఉపయోగించడం లేదు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత ప్రఫుల్లా గుడాధే బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం వీవీప్యాట్ వ్యవస్థ ఎంతో అవసరమని అన్నారు. ఒకవేళ ఇవి సాధ్యం కాకుంటే బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించేలా ఎస్ఈసీని ఆదేశించాలని కోరారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ వీవీప్యాట్ మెషిన్లు లేకుండా ఈవీఎంలు వాడడాన్ని అనుమతించకూడదని ఉన్నత న్యాయస్థానాన్ని




అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అనిల్ కిలోర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. వీవీప్యాట్‌లు తప్పనిసరిగా ఉపయోగించాలని సుప్రీం కోర్టు తీర్పు చెబుతున్నప్పటికీ.. ఈ ఎన్నికల్లో ఉపయోగించకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించింది. అయితే, సుప్రీం తీర్పు కేవలం సార్వత్రిక ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థలకు కాదని మహారాష్ట్ర ఎన్నికల కమిషన్ తరపున న్యాయవాది వాదించారు. రాష్ట్రంలో 2017లో మున్సిపల్ ఎన్నికల్లోనూ వీవీప్యాట్‌లను వినియోగించలేదని గుర్తుచేశారు. స్థానిక సంస్థల చట్టాల్లో వీటిని తప్పనిసరిగా ఉపయోగించాలని లేదని పేర్కొంటూ అఫిడవిట్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణ నవంబర్ 20కి వాయిదా వేసింది. మరోవైపు డిసెంబర్ 2న మహారాష్ట్రలో స్థానిక సంస్థల తొలి దశ పోలింగ్ జరగనుంది.



## కాలుష్య కోరల్లో ఢిల్లీ..
### క్రీడా పోటీలపై 'సుప్రీం' కీలక ఆదేశాలు!

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం సమస్య తీవ్రమైంది. శీతాకాలం కావడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఈ నేపథ్యంలో.. పాఠశాలల స్పోర్ట్స్, అథ్లెటిక్స్ కార్యక్రమాలను వాయిదా వేసేలా ఆదేశించడాన్ని పరిశీలించాలని 'వాయునాణ్యత నిర్వహణ కమిషన్'కు సుప్రీం కోర్టు సూచించింది. ఢిల్లీఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యంపై దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. నవంబరు, డిసెంబరు నెలల్లో అండర్16, అండర్14 విద్యార్థులకు ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైనట్లు సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కాలుష్యం గరిష్ఠ స్థాయిలో ఉండే ఈ నెలల్లో ఇటువంటి ఈవెంట్స్‌కు అనుమతించడం.. స్కూల్ పిల్లలను గ్యాస్ ఛాంబర్‌లో ఉంచడంతో సమానమేనని వాదించారు. ఈ సమయంలో బహిరంగ క్రీడా కార్యకలాపాలు నిర్వహించడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం..వాయు కాలుష్యం తక్కువగా ఉండే నెలల్లో క్రీడాపోటీలు నిర్వహించేలా స్కూళ్లను ఆదేశించాలని 'సీఏక్యూఎం'కు సూచించింది. ఢిల్లీఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యం మరింత పెరగకుండా నిరోధించేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈ సంస్థను ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే.

# అల్ ఫలా నుంచి 10 మంది 'మిస్సింగ్'..?

ఢిల్లీ పేలుడు ఘటనలో హరియాణాలోని అల్ ఫలా యూనివర్సిటీ పేరు వినిపిస్తోంది. ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో అరెస్టయిన నిందితులకు ఈ విశ్వవిద్యాలయంతో సంబంధం ఉన్నట్లు బయటపడింది. ఈ నేపథ్యంలో వర్సిటీ వ్యవహారాలపై అధికారులు ఇప్పటికే దృష్టి సారించారు. ఈ క్రమంలోనే విశ్వవిద్యాలయానికి చెందిన దాదాపు 10 మంది కన్పించకుండా పోయారని నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ''కన్పించకుండా పోయిన వ్యక్తుల ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయి. వీరిలో ముగ్గురు కశ్మీర్‌వాసులు ఉన్నట్లు సమాచారం. ఢిల్లీలో పేలుడు ఘటనతో ముడిపడిన




ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌తో వీరికి సంబంధాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ విషయాన్ని ఇప్పుడే ధ్రువీకరించలేం'' అని నిఘా వర్గాలను ఉటంకించాయి. ఈ టెర్రర్ మాడ్యుల్‌కే చెందిన ఉమర్.. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు పేలుడుకు కారణమైన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో అల్ ఫలా వర్సిటీకి చెందిన ముగ్గురు వైద్యులు సహా తొమ్మిది మంది అరెస్టయ్యారు. అల్ ఫలా వర్సిటీ ప్రధాన కార్యాలయంతో పాటు మరో 24 ప్రాంతాల్లో మంగళవారం ఈడీ దాడులు నిర్వహించింది. అల్ ఫలా గ్రూప్ ఛైర్మన్ జవాద్ అహ్మద్ సిద్ధిఖీని అరెస్టు చేసింది. తప్పుడు అక్రిడిటేషన్ ఆధారంగా విద్యార్థుల నుంచి మొత్తం రూ.415 కోట్లు వసూలు చేసినట్లు గుర్తించింది. టెర్రర్ మాడ్యూల్‌తో సంబంధాలు బయటపడిన అనంతరం భారత విశ్వవిద్యాలయాల సంఘం (AIU) ఈ వర్సిటీ సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఢిల్లీ పోలీసులు కూడా రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు.

# ఎలిజబెత్ లెడరర్.. ఈ కళాఖండం ఖరీదు రూ.2087 కోట్లు!

ఆస్ట్రియన్ కళాకారుడు గుస్తావ్ క్లిమ్ట్ గీసిన ఓ కళాఖండం వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. న్యూయార్క్‌లో నిర్వహించిన వేలంలో 'ఎలిజబెత్ లెడరర్' చిత్రం 236.4 మిలియన్ డాలర్లు (రూ.2087 కోట్లు) పలికింది. ఆరుగురు బిడ్డర్లు ఇందుకు పోటీ పడగా.. కేవలం 20 నిమిషాల్లోనే అమ్ముడైపోయింది. వేలంలో అమ్ముడైన అత్యంత ఖరీదైన రెండో కళాఖండంగా నిలిచింది. అయితే, కొనుగోలు దారుల వివరాలు మాత్రం వేలం సంస్థ వెల్లడించలేదు. ఆస్ట్రియన్ కళాకారుడు గుస్తావ్ క్లిమ్ట్ గీసిన చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందాయి. ఆయన కళాఖండాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉంది. వియన్నాలో అత్యంత సంపన్న కుటుంబాన్ని వర్ణిస్తూ.. ఆయన గీసిన మహిళ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. ఆరు అడుగుల పొడవున్న 'ఎలిజబెత్ లెడరర్' చిత్రాన్ని గీసేందుకు ఆయనకు దాదాపు మూడేళ్లు పట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆ కళాఖండం కొన్నేళ్లు కనిపించకుండా పోగా, ఇటీవలే లభ్యమైంది.



### కొనుగోళ్ల జోష్.. 85వేల ఎగువన

# ముగిసిన సెన్సెక్స్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల నుంచి గట్టెక్కాయి. ఐటీ, ఫైనాన్షియల్ షేర్లు రాణించడంతో మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 84,643.78 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో మొదలైంది. ఆ తర్వాత మార్కెట్లు కోలుకున్నాయి. ముడి చమురు ధరలు తగ్గడంతో పాటు బలమైన కొనుగోళ్లతో మార్కెట్లు లాభపడ్డాయి. ఇంట్రాడేలో 84,525.98 కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్టంగా 85,236.77 పాయింట్ల వరకు పెరిగింది. చివరకు 513.45 పాయింట్ల లాభంతో 85,186.47 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 142.60 పాయింట్లు పెరిగి 26,052.65 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.3శాతం పెరగ్గా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4శాతం పడిపోయింది. నిఫ్టీ బ్యాంక్ వరుసగా మూడవ సెషన్‌లో కొత్తగా 59,264.25 పాయింట్ల వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. 0.54శాతం లాభాలతో 59,216.05 వద్ద ముగిసింది. ఐటీ ఇండెక్స్ 3శాతం, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.2శాతం పెరిగింది. మీడియా ఇండెక్స్ 0.3శాతం, రియాలిటీ ఇండెక్స్ 0.4శాతం తగ్గాయి.

నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మాక్స్ హెల్త్‌కేర్, ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ ఉండగా.. టీఎంపీవీ, కోల్ ఇండియా, మారుతి సుజుకి, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయాయి. వెస్ట్రన్ రైల్వేస్ నుంచి ఆర్డర్ సాధించినా జీఆర్ ఇన్ఫ్రాప్రాజెక్ట్స్ షేర్లు 2శాతం పడిపోయాయి. ఇన్ఫోసిస్ షేర్లు బైబ్యాక్ ఆఫర్ కంటే ముందు 4శాతం పెరగ్గా.. హిందూస్తాన్ యూనిలీవర్ షేర్లు దాదాపు 2శాతం వృద్ధిని నమోదు చేశాయి. బయోకాన్ షేర్ ధర 3శాతం తగ్గగా.. సెబీ హెచ్చరిక లేఖతో నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ షేర్ ధర 1.2శాతం పడిపోగా.. కెనడా విస్తరణ నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు 4శాతం పెరిగాయి. భారత్ ఫోర్జ్, ఎం అండ్ ఎం ఫైనాన్షియల్, ఎంసిఎక్స్ ఇండియా, హీరో మోటోకార్ప్, ఫెడరల్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, ఎస్‌బీఐ, బీహెచ్ఈఎల్ వంటి 120కి పైగా స్టాక్‌లు బీఎస్ఇలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి.

## ఇకపై బ్యాంకుల నుంచి ‘1600’ సిరీస్‌తోనే కాల్స్...

**ట్రాయ్ కీలక ఆదేశాలు**

**ఫ్రాడ్ కాల్స్‌ను అరికట్టేందుకు ‘1600’ నంబర్ సిరీస్ తప్పనిసరి**

**బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ట్రాయ్ కీలక ఆదేశాలు**

**వివిధ సంస్థలకు దశలవారీగా గడువు విధించిన టెలికాం రెగ్యులేటరీ**

**అసలైన కాల్స్ గుర్తించేందుకు వినియోగదారులకు సులభతరం**

**బీమా సంస్థలకు గడువుపై ఐఆర్‌డీఏఐతో చర్చలు**



**న్యూఢిల్లీ:** దేశంలో నానాటికీ పెరిగిపోతున్న స్పామ్, మోసపూరిత కాల్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగంలోని సంస్థలతో పాటు ప్రభుత్వ విభాగాలు తమ సర్వీస్, లావాదేవీల కాల్స్ కోసం తప్పనిసరిగా ‘1600’ తో మొదలయ్యే నంబర్ సిరీస్‌ను ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల వినియోగదారులు ఏది అసలైన కాల్, ఏది మోసపూరిత కాల్ అనేది సులువుగా గుర్తించగలుగుతారు.

ఈ కొత్త నిబంధనను దశలవారీగా అమలు చేసేందుకు ట్రాయ్ గడువులను నిర్దేశించింది. వాణిజ్య బ్యాంకులు (ప్రభుత్వ, ప్రైవేట్, విదేశీ) 2026, జనవరి 1 నాటికి ఈ సిరీస్‌కు మారాల్సి ఉంటుంది. రూ. 5,000 కోట్లకు పైగా ఆస్తులున్న పెద్ద నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు , పేమెంట్స్ బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు 2026, ఫిబ్రవరి 1 గడువుగా విధించారు. మ్యూచువల్ ఫండ్లు, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు 2026, ఫిబ్రవరి 15 వరకు సమయం ఇచ్చారు.

మిగిలిన ఎన్‌బీఎఫ్‌సీలు, సహకార బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు 2026, మార్చి 1 తుది గడువుగా నిర్ణయించారు. క్వాలిఫైడ్ స్టాక్‌బ్రోకర్లు , 2026 మార్చి 15 నాటికి ఈ మార్పు పూర్తి చేయాలి. ఇప్పటికే దాదాపు 485 సంస్థలు ‘1600’ సిరీస్‌లో 2800కి పైగా నంబర్లను వినియోగిస్తున్నాయని ట్రాయ్ తెలిపింది. అయినప్పటికీ, కొందరు ఇప్పటికీ పాత 10-అంకెల నంబర్లను వాడుతూ ఉండటంతో మోసాలకు ఆస్కారం ఏర్పడుతోందని భావించిన ట్రాయ్, ఈ మార్పును తప్పనిసరి చేసింది.

ఇక బీమా రంగానికి సంబంధించిన గడువుపై ఐఆర్‌డీఏఐతో చర్చలు జరుపుతున్నామని, త్వరలోనే తేదీలను ప్రకటిస్తామని ట్రాయ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కొత్త నిబంధన అమలుతో వినియోగదారుల ఆర్థిక భద్రత మెరుగుపడటంతో పాటు, సంస్థల పేరుతో జరిగే మోసపూరిత కాల్స్‌కు అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## గుజరాత్‌లో ‘చిల్లర’ కోసం బ్యాంకుకు క్యూ కట్టిన జనాలు

**మెహనసాలోని బ్యాంకు వద్ద కనిపించిన పెద్దనోట్ల రద్దు నాటి క్యూ దృశ్యం**

**కొత్తగా ముద్రించిన రూ.10 నోట్ల జారీకి శిబిరం ఏర్పాటు చేసిన బ్యాంకు**

**రూ.14 లక్షల విలువైన తక్కువ విలువ కలిగిన కరెన్సీ జారీ చేసిన బ్యాంకు**



**గుజరాత్:** గుజరాత్ రాష్ట్రం, మెహసానాలోని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు వద్ద ‘చిల్లర’ కోసం జనాలు బారులు తీరారు. తొమ్మిదేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు సమయంలో ప్రజలు రోజుల తరబడి బ్యాంకుల ముందు వరుసలు కట్టిన దృశ్యం అందరికీ గుర్తుండే ఉంటుంది. సరిగ్గా అలాంటి పరిస్థితే ఇప్పుడు మెహసానాలో పునరావృతమైంది. అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు వెలుపల పొడవైన క్యూలు దర్శనమిచ్చాయి.

వివిధ మీడియా కథనాల ప్రకారం, మెహసానా కోఆపరేటివ్ బ్యాంకు ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసి కొత్తగా ముద్రించిన రూ. 10 నోట్లు, నాణేలను జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకి చేరుకున్నారు. ఉదయం నుంచి ప్రజలు వరుసలలో నిలబడ్డారు. స్థానిక వ్యాపారులు, ఇతర వర్గాల వారి డిమాండ్ మేరకు తక్కువ విలువ కలిగిన కరెన్సీ కొరతను పరిష్కరించే లక్ష్యంతో బ్యాంకు ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా రూ. 14 లక్షల విలువైన రూ. 10 నోట్లు, కొంత మొత్తంలో రూ. 20 నోట్ల కట్టలు, అలాగే రూ. 3 లక్షల విలువైన రూ. 2, రూ. 5 నాణేలను బ్యాంకు పంపిణీ చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రక్రియ కొనసాగిది. ప్రజలు తమ అవసరాల మేరకు చిల్లర తీసుకోవడానికి బ్యాంకుకు వచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బ్యాంకు మేనేజర్ ముఖేశ్ భాయ్ పటేల్ తెలిపారు.



# అండర్-19 వరల్డ్ కప్ షెడ్యూల్‌ను ప్రకటించిన ఐసీసీ..

**వేర్వేరు గ్రూపుల్లో భారత్-పాక్..!**

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వచ్చే అండర్-19 ప్రపంచ కప్ షెడ్యూల్‌ను బుధవారం ప్రకటించింది. ఈ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జింబాబ్వే-నమీబియా వేదికగా జరుగన్నది. ఈ టోర్నీలో 16 జట్లు పాల్గొంటాయి. ఫైనల్‌తో సహా మొత్తం 41 మ్యాచ్‌లు జరుగుతాయి. ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఈ సారి భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌ను చూడలేం. రెండు వేర్వురు గ్రూప్స్‌లో ఉన్నాయి. అండర్-19 ప్రపంచ కప్‌లో నాలుగు గ్రూపులు ఉంటాయి. ఇందులో నాలుగు జట్లు చొప్పున ఉంటాయి. గ్రూప్ దశ తర్వాత సూపర్ సిక్స్.. అందులో నుంచి నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఫైనల్ మ్యాచ్ హరారేలో జరుగుతుంది. టోర్నీలో తొలి మ్యాచ్‌ను భారత్-యూఎస్ఏ మధ్య జరుగుతుంది. రెండో మ్యాచ్ జింబాబ్వే-స్కాట్లాండ్‌తో తలపడుతుంది. టాంజానియా తొలిసారిగా వరల్డ్ కప్ ఆడబోతున్నది. మొదటి మ్యాచ్‌ను వెస్టిండిస్‌తో ఆడుతుంది. అండర్-19 ప్రపంచ కప్ మ్యాచ్‌లు హరారే స్పోర్ట్స్ క్లబ్, తకాషింగా స్పోర్ట్స్ క్లబ్, జింబాబ్వేలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌తో సహా ఐదు వేదికల్లో జరుగుగుతాయి. నమీబియాలో నమీబియా క్రికెట్ గ్రౌండ్, హెచ్‌పీ ఓవల్‌లో వరల్డ్ క్లబ్‌లో మ్యాచులు జరుగుతాయి.

గ్రూప్-ఏలో భారత్, యూఎస్ఏ, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఉన్నాయి. గ్రూప్-బీలో జింబాబ్వే, పాక్తిస్తాన్, ఇంగ్లండ్, స్కాట్లాండ్.. గ్రూప్-సీలో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక జట్లు ఉన్నాయి. గ్రూప్-డీలో టాంజానియా, వెస్టిండిస్, ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా ఉన్నాయి. ఐసీసీ వెబ్‌సైట్‌లో టోర్నమెంట్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ టోర్నమెంట్‌లో టాంజానియా అరంగేట్రం చేస్తుండగా.. జపాన్ 2020 తర్వాత మళ్లీ టోర్నీలో అడుగుపడుతున్నది. భారత్ తొలి మ్యాచ్‌ను 15న అమెరికాతో, 17న బంగ్లాదేశ్‌తో, జనవరి 24న న్యూజిలాండ్‌తో తలపడుతుంది. భారత్ మ్యాచులన్నీ బులవాయో వేదికగా జరుగుతాయి. మొదటి రౌండ్‌లో గ్రూప్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్‌లో ఆడుతాయి. ఇందులో ఆరు జట్లను రెండు గ్రూపులుగా విడిపోతాయి.

## గెలిచినప్పుడు లేని మాటలు ఇప్పుడెందుకు?

**కోల్‌కతా పిచ్‌పై వస్తున్న విమర్శలపై స్పందించిన భువనేశ్వర్**

**భారత్‌లో స్పిన్ పిచ్‌లు దశాబ్దాలుగా ఉన్నవేనన్న పేసర్**

**గెలుస్తున్నప్పుడు ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదని వ్యాఖ్య**

**గెలుపోటములు సహజం, ఆందోళన అవసరం లేదన్న భువీ**

**నలుగురు స్పిన్నర్లతో ఆడటాన్ని సమర్థించిన భువనేశ్వర్**




**కోల్‌కతా:** కోల్‌కతా వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఓటమిపాలవ్వడంతో పిచ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్‌లో స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లను తయారుచేయడం కొత్తేమీ కాదని, ఇది కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నదేనని స్పష్టం చేశాడు.

ఈ సందర్భంగా భువనేశ్వర్ మాట్లాడుతూ... “భారత్‌లో స్పిన్ పిచ్‌లు సిద్ధం చేయడం ఇప్పుడు మొదలైంది కాదు. చాలా ఏళ్లుగా ఇదే కొనసాగుతోంది. జట్టు గెలుస్తున్నంత కాలం ఎవరూ దీనిపై ప్రశ్నించలేదు. ఇప్పుడు ఓటమి ఎదురవగానే విమర్శలు చేస్తున్నారు. ఆటలో గెలుపోటములు సహజం. గతంలోనూ భారత్ ఓడిపోయింది, ఇదేమీ మొదటి ఓటమి కాదు. కాబట్టి దీని గురించి ఎక్కువగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు” అని అభిప్రాయపడ్డాడు.

కోల్‌కతా పిచ్ పూర్తిగా టర్నింగ్ ట్రాక్ అని, అలాంటి పరిస్థితుల్లో నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలన్న జట్టు నిర్ణయాన్ని భువనేశ్వర్ సమర్థించాడు. “పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉన్నప్పుడు నలుగురు స్పిన్నర్లతో ఆడటంలో తప్పేం లేదు. మ్యాచ్ జరిగిన తీరును బట్టి చూస్తే జట్టు కూర్పు సరైనదే” అని వివరించాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో భారత్ ఓడిపోవడంతో పిచ్ తీరుపై మాజీ ఆటగాళ్లు, క్రీడా విశ్లేషకులు విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే.

## అగ్రస్థానం కోల్పోయిన రోహిత్ శర్మ..

**వన్డే బ్యాటర్లలో కివీస్ ప్లేయర్‌కు ఫస్ట్ ర్యాంక్**

**దుబాయ్:** వన్డే బ్యాటింగ్ తాజా ర్యాంకుల్లో భారత ఓపెనర్ రోహిత్ శర్మ అగ్రస్థానాన్ని కోల్పోయారు. బ్యాటింగ్ ర్యాంకుల్లో అతను రెండో స్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్‌కు చెందిన డారిల్ మిచెల్ .. ఐసీసీ వన్డే బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. వన్డే బ్యాటర్లలో టాప్ ప్లేస్‌కు చేరుకున్న రెండో న్యూజిలాండ్ బ్యాటర్‌గా నిలిచాడతను.

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను అద్భుతమైన సెంచరీ చేశాడు. కరీబియన్ జట్టుతో జరుగుతున్న వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో అతను సెంచరీ చేశాడు. వన్డేల్లో అతనికి ఇది ఏడో సెంచరీ. ప్రస్తుతం మిచెల్‌కు 782 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. రోహిత్ శర్మ కన్నా ఓ పాయింట్ ఎక్కువ ఉన్నాడతను.

1979లో కివీస్ బ్యాటర్ గ్లెన్ టర్నర్ ఒక్కడే ఆ దేశం తరపు నుంచి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. కివీస్ మాజీ క్రికెటర్లు మార్టిన్ క్రోవ్, ఆండ్రూ జోన్స్, రోజర్ టౌస్, నాథన్ ఆస్టిల్, కేన్ విలియమ్‌సన్, మార్టిన్ గుప్తిల్, రాస్ టేలర్.. టాప్ అయిదు ర్యాంకుల్లో మాత్రమే నిలిచారు.

తాజా ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ బ్యాటర్ జర్దాన్ మూడవ స్థానంలో గిల్ నాలుగవ, కోహ్లీ అయిదో స్థానంలో నిలిచారు.



# టీమిండియా హెడ్ కోచ్‌గా గంభీర్‌ను తొలగించాలని డిమాండ్..

**మాజీ కెప్టెన్ గంగూలీ రెస్పాన్స్ ఇదే..!**

**న్యూఢిల్లీ:** తొలి టెస్టులో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా 30 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఆ తర్వాత ఈడెన్ గార్డెన్ పిచ్‌పై పెద్ద దుమారమే రేగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన విషయం తెలిసిందే. మెడ గాయంతో ఆసుప్రతిలో చేరి మ్యాచ్ మొత్తానికి దూరమయ్యాడు. అయితే, పిచ్ తొలి రోజు నుంచే బంతి బౌన్స్‌తో పాటు టర్న్ అవడం కనిపించింది. మ్యాచ్ ముగిసిన అనంతరం అభిమానులతో పాటు మాజీలు సైతం టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాలపై తీవ్ర విమర్శలు గుప్పించడంతో పాటు ప్రశ్నలు లేవనెత్తారు. టెస్ట్ కోచ్‌గా గంభీర్‌ను తొలగించాలని డిమాండ్లు కూడా వచ్చాయి. తాజాగా బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, క్యాబ్ చీఫ్ సౌరవ్ గంగూలీ గంభీర్‌ను తొలగించాలనే డిమాండ్లపై స్పందించారు. గౌతమ్ గంభీర్‌ను తొలగించే ప్రశ్నే లేదని.. శుభ్‌మన్ నేతృత్వంలోని ఇంగ్లండ్‌లో రాణించిందని గుర్తు చేశారు మాజీ కెప్టెన్.

స్వదేశంలోనూ గొప్పగా రాణిస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను ఇలా ఎందుకు తయారు చేశారనే దానిపై చర్చ సాగుతుండగా.. ఓ చర్చలో ఈ విషయంలో మిమ్మల్ని సంప్రదించారా? అని ప్రశ్నించగా.. గంగూలీ మాట్లాడుతూ ఇందులో తన ప్రమేయం ఏమీ లేదన్నారు. టెస్టు మ్యాచుకు నాలుగు రోజుల ముందు వికెట్





తయారీ పనిని బీసీసీఐ క్యూరేటర్లు చేపడుతారని.. క్యాబ్‌కు సొంత క్యూరేటర్ బృందం ఉంటుందన్నారు. కానీ, టీమిండియా మేనేజ్‌మెంట్ నుంచి రిక్వెస్ట్‌లు వస్తాయని.. వారి అభ్యర్థలన మేరకు పిచ్ తయారు చేస్తారన్నారు. ఈడెన్ గార్డెన్స్ భారత బ్యాట్స్‌మెన్‌కు పిచ్ అనుకూలంగా లేదని బీసీసీఐ మాజీ ఛైర్మన్ అంగీకరించారు. ఈడెన్ గార్డన్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీ సైతం స్పందించారు. టీమ్ మేనేజ్‌మెంట్, కోచ్ కోరిక మేరకు పిచ్ తయారు చేసినట్లు సుజన్ స్పష్టం చేశారు.

## వారణాసి నుంచి
# రణకుంభ పాట విడుదల




**టాకీస్:** దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన 'రణ కుంభ' పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. 'ప్రళయం ప్రళయం' అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. 'వారణాసి' సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

## ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ విడుదల




**టాకీస్:** టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్-మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రంలో రామ్.. ఒక సూపర్ స్టార్‌కి వీరాభిమానిగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర గారు పోషించిన 'ఆంధ్రా కింగ్' పాత్రకు రామ్ ఎంతటి డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని ట్రైలర్ హైలైట్ చేసింది. రామ్ పోతినేని ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.

## డిసెంబర్ 31 నుంచి నటనకు ఇక స్వస్తి
### సినీ ప్రస్థానానికి గుడ్‌బై చెప్పిన నటి తులసి



**టాకీస్:** ప్రముఖ నటి తులసి తన దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు పలికారు. డిసెంబరు 31 నుంచి అధికారికంగా రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించా రు. తన రిటైర్‌మెంట్ జీవితాన్ని షిరిడీ సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపి అభిమానులను భావోద్వేగానికి గురిచేశారు. 1967లో బాలనటిగా రంగప్రవేశం చేసిన తులసి ఇప్పటి వరకు సుమారు 300కు పైగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటీవలి వరకు ఆమె అనేక సినిమాల్లో క్యారెక్టర్ పాత్రలు వేసి మెప్పిస్తూ వచ్చారు. డిసెంబరు 31న షిరిడీ దర్శనానికి వెళ్తున్నానని, ఆ రోజు నుంచే తన రిటైర్‌మెంట్ ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1967లో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. 1974లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం 'అరంగేట్రం'లో బాలనటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది.



# పవన్ కళ్యాణ్ కామెడీ టైమింగ్ అదిరిపోతుంది..
### రాశీఖన్నా



టాకీస్: తెలుగులో హిట్స్ లేకపోయినా.. వరుస ఆఫర్స్ అందుకుంటున్న హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. ఆఫర్స్ అందుకుంటూ తెలుగులో దూసుకుపోతున్న హీరోయిన్స్ లో అందాల భామ రాశీఖన్నా ఒకరు. ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది ఈ వయ్యారి భామ. మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అలాగే అందం, నటన పరంగాను రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి.ఇక రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది. కానీ ఈ అమ్మడు అంతగా అవకాశాలు రావడం లేదు. దాంతో బాలీవుడ్ కు చెక్కేసింది ఇటీవలే హిందీలో ఓ వెబ్ సిరీస్ కూడా చేసింది. దాంతో ఇప్పుడు బాలీవుడ్ పైనే ఈ చిన్నది ఫోకస్ పెడుతుంది. దాంతో రాశీ ఖన్నా టాలీవుడ్ కు దూరం అవుతుంది అని అంటున్నారు కొందరు అభిమానులు. తమిళ్ లో అడపాదడపా సినిమాలు చేస్తుంది. ఇక ఇటీవలే తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకుంటుంది. ఇటీవలే యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ సరసన తెలుసు కదా అనే సినిమా చేసి సక్సెస్ అందుకుంది.

ఇక ఇప్పుడు పవన్ కళ్యాణ్ సరసన సినిమా చేస్తుంది ఈ వయ్యారి భామ. పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో రాశీ ఖన్నా నటిస్తుంది. ఈ సినిమాకు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. నేను కథ వినకుండా ఒకే చేసిన ఏకైక సినిమా ఉస్తాద్ భగత్ సింగ్. కేవలం పవన్ కళ్యాణ్ హీరో అన్నారనే నేను సినిమా ఓకే చేశా.. ఎందుకంటే ఆయన సినిమా తెచ్చే స్థాయి నేను కోరుకుంటాను. ఇప్పుడు ఆయన హీరో.. ఆ సినిమాలో నేను ఒక పార్ట్ అని మాత్రమే తెలుసు.. దాంతో నేను చాలా హ్యాపీగా ఉన్నా.. పవన్ కళ్యాణ్ ఎంత గొప్ప వ్యక్తి అనే విషయం తెలుసుకున్నా.. అలాగే ఆయన మహిళల పై చూపించే గౌరవం నాకు బాగా నచ్చింది. సెట్‌లో నేను చూసిన చిన్న చిన్న విషయాలు నన్ను ఆశ్చర్యపరిచాయి. పవన్ కళ్యాణ్ కామెడీ టైమింగ్ అదిరిపోతుంది.. అంటూ పవన్ పై పొగడ్తలు కురిపించింది రాశి ఖన్నా.

## MOVIE TIME

# నిన్న అదితి..నేడు శ్రియ
### నకిలీ వాట్సప్ క్రియేట్ చేసిన దుండగులు



**టాకీస్:** నటి అదితిరావు హైదరి పేరుతో ఇటీవల నకిలీ వాట్సప్ క్రియేట్ చేసి ఒక వ్యక్తి ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో నటి శ్రియ శరణ్ ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటి వారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులను నేను కలిసి వర్క్ చేయనున్న వారికి మెసేజ్‌లు చేస్తున్నాడు. అంద రూ అప్రమత్తంగా ఉండండి అంటూ శ్రియ తెలిపారు. తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి ఇటీవల విజ్ఞప్తి చేశారు. 'నా పేరుతో పాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఫొటోషూట్ లాంటి వాటికోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలియజేయండి' అని పేర్కొన్నారు.

# మరో వివాదంలో నటుడు ధనుష్
### టీవీ నటి మాన్యా ఆనంద్ సంచలన వ్యాఖ్యలు

**టాకీస్:** నిత్యం ఏదో ఓ వార్తలో ప్రధానంగా నిలిచే తమిళ స్టార్ హీరో ధనుష్ పై మరో కొత్త వివాదం రేగింది. ఈసారి ప్రముఖ టీవీ నటి మాన్యా ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన విషయాలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో పెద్ద కలకలం రేపుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. ధనుష్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో ముఖ్యమైన పాత్ర ఇస్తామని చెప్పి ఆయన మేనేజర్ శ్రేయాస్ తనను సంప్రదించాడని, నేను కూడా 'ఒక మంచి అవకాశం వస్తుందని నిజంగా నమ్మాను. కానీ రోజులు గడిచేకొద్దీ వాళ్లు అడిగిన మాటలు, ప్రవర్తన చూసి నేను షాక్ అయ్యానని పేర్కొంది. 'పాత్ర కోసం కొన్ని కమిట్‌మెంట్‌లు ఇవ్వాలి' అని సూచిస్తూ, ధనుష్‌తో 'అడ్జస్ట్మెంట్' చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆరోపించింది. వారి అసలు ఉద్దేశం త్వరగానే తెలుసుకుని నేను జాగ్రత్త పడ్డానని కానీ పాత్ర కోసం మహిళలపై ఇలాంటి ఒత్తిడి తేవడం చాలా తప్పని మాన్యా ఇంటర్వ్యూలో తెలిపింది. ఆ విషయం నన్ను తీవ్రంగా కలచివేసిందని వివరించింది. ఇంకా మాన్యా మాట్లాడుతూ..ఇలాంటి ఒత్తిళ్లు, 'అడ్జస్ట్మెంట్' పేరుతో జరిగే అనైతిక డిమాండ్లు చిత్రపరిశ్రమలో ఇంకా కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చే నటీమణులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు భయంతో బయట పెట్టలేరని, ఈ విషయాలు బహిరంగంగా చెప్పడానికి చాలా ధైర్యం కావాలని, తనలాంటి వారు మాట్లాడితేనే మార్పు వస్తుందని ఆమె అన్నారు. అయితే.. అమె ఈ ఘటన ఎప్పుడు జరిగింది, ఏ సినిమా విషయంలో చోటు చేసుకున్నది, ఇప్పుడే ఎందుకు బయట పెట్టిందనే విషయాలు మాత్రం చెప్పలేదు. అయితే అయితే ధనుష్, లేదా ఆయన టీమ్, మేనేజర్ శ్రేయాస్ ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే.. వైరల్‌గా మారిన ఈ వివాదంపై అరోపణలు చేసిన నటి మాన్యా ఆనంద్ స్పందించి ఇన్స్టాలో ఓ న్యూస్ షేర్ చేసుకుంది. నా ఇంటర్వ్యూ అధారంగా చాలా ఛానళ్లు ధనుష్‌పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేసింది. దయచేసి ఒరిజినల్ వీడియోను చూసి ఓ నిర్ణయానికి వచ్చి మట్లాడండి అని కోరింది. నన్ను సంప్రదించిన వ్యక్తి తన పేరు శ్రేయాస్ అని చెప్పుకుంటూ సినిమాకి అవకాశాలు ఇస్తానని మాట్లాడిన వ్యక్తి నిజమైనవాడు కాకపోవచ్చని నేను ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొన్నానని, ఆ నంబర్‌ను ధనుష్ సర్ టీమ్‌కు పంపించి నిజానిజాలు తెలుసుకుంటానని కూడా చెప్పానని వివరించింది. అందరూ దయచేసి తప్పుడు వార్తలు వైరల్ చేయవద్దని వేడుకుంది..ట్రోలింగ్, వైరల్ చేసే ముందు ఒరిజినల్ వీడియోను చూడండి అని కోరింది. మాన్య గతంలో తెలుగులో జెమిని టీవీలో వచ్చిన భాగ్య రేఖ అనే సీరియల్‌లోనూ నటించింది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.